జేపీఎస్‌లపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న రెడ్డప్ప



మక్తల్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో 7వ రోజు నిరసన తెలిపారు. అనంతరం సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో మద్దతు తెలిపి కార్యదర్శులకు రూ.50వేలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ రెగ్యులర్ చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, రమేష్, నర్సిములు, అంజి, రాజ్యలక్ష్మి, అశోక్‌గౌడ్, మధు, రవికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యలయం ఎదుట వీరు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ నాయకులు నర్సింహా, సంజీవ్ తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, బసప్ప, సుధాకర్ రెడ్డి, విజయలక్ష్మి, నవీన, లక్ష్మి, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులపై రాష్ట్ర ప్రభుత్వం చూయిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప, టీపీసీసీ ప్రతినిధి హర్షవర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద 7వ రోజు ధర్నా కొనసాగించారు. జీపీల్లో వారు నిర్వహించిన విధులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ముగ్గులు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మద్దతు తెలిపిన వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులందరికీ రెండేళ్లు ప్రొహిబీషన్ పీరియడ్ ఉంటే సీఎం కేసీఆర్ నోటిఫికేషన్‌లో మూడేళ్లు పెట్టారని, తిరిగి ఆ సమయాన్ని నాలుగేళ్లకు పెంచుతూ జీఓ 26 సైతం ఇచ్చినా అన్ని రకాలుగా ప్రభుత్వానికి సహకరిస్తూ పూర్తి చేశారని గుర్తు చేశారు. నెలరోజుల కిందనే వారికి రెగ్యులర్ చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదని అసహనం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో బెస్ట్ జీపీలుగా తెలంగాణ నుంచే ఎంపిక కావడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో ఉందని, రాష్ట్రానికి ఎంతో పేరు తెచ్చిపెట్టిన వీరిని విస్మరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, బబిత, నవిత, శ్రీనివాస్, బస్వరాజ్, రాములు, చాణిక్య, కనకప్ప, మహేష్, తిరుపతిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విరాళాల వెల్లువ

నారాయణపేట రూరల్: ప్రైవేట్‌గా ప్రారంభమై ఎయిడెడ్‌గా మారి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా రూపాంతరం చెందిన సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల తాజాగా న్యాక్ గ్రేడ్ గుర్తింపు రేసులో ఉంది. దీంతో కళాశాలను నెలరోజులుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించే పనిలో అధ్యాపకులు నిమజ్ఞమయ్యారు. అయితే దీనికి అవసరమైన నిధుల సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి అందులో పూర్వ విద్యార్థులను కలుపుతూ వచ్చారు. వారి నుంచి తోచినంత ఆర్థికసాయాన్ని తీసుకుని చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళ్తున్నారు. 1988–91 నుంచి 2009–12 బ్యాచ్ వరకు 200మంది డబ్బులను అందించారు. ఇంకా ప్రతి ఒక్కరికీ చేరాలనే ఉద్దేశ్యంతో ఈనెల 7న ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని చేపడుతున్నారు. ప్రతి రోజు కళాశాలకు చేరుకుని పలువురు పూర్వ విద్యార్థులు



సీఎస్ఆర్ డీసీ ప్రిన్సిపాల్, న్యాక్ కో ఆర్డినేటర్‌ను సన్మానించి నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రిన్సిపాల్ రంగారెడ్డి, న్యాక్ కో ఆర్డినేటర్ నారాయణగౌడ్‌లను శాలువాతో సన్మానించి, కళాశాల అభివృద్ధికి నగదు అందిచేస్తున్నారు. గురువారం స్థానిక శ్రీసాయి కళాశాల యాజమాన్యం రూ.51వేలను అందచేశారు. అయితే ఆర్థిక సహకారం చేసిన పూర్వ విద్యార్థుల్లో వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డితో పాటు పలువురు వివిధ జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం తగదు



రాంపూర్‌గేట్ వద్ద రైస్‌మిల్లును సందర్శించిన పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: రైతుల ఫిర్యాదు మేరకు గురువారం రైస్ మిల్లులను పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి సందర్శించి రైతులకు సకాలంలో తూకాలు చేసి, హమాలీ డబ్బులు, ఎలాంటి తరుగు లేకుండా ధ్యాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో మిల్లర్లు తేమ శాతాన్ని పక్కనబెట్టి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. సకాలంలో రైతులకు విక్రయ డబ్బులు ఖాతాలో జమచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, ఏఈఓ మహేష్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ చిన్నయ్య, సీఈఓ ఉదయ్, బీఆర్ఎస్ యూత్ నాయకులు రామన్‌గౌడ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పౌర్ణమి వేడుకలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని సాయివిజయ్ కాలనీలో కొలువుదీరిన షిర్డీ సాయి హనుమాన్ మందిరంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 6.30 గంటలకు బాబాకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మహా మంగళ హారతి అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమం ఉంటుందని భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి సత్యనారాయణ స్వామి జాతర



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో కొలువుదీరిన సత్యనారాయణ స్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు జరిగే జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. జాతర మహోత్సవంలో భాగంగా 5 తేదీన ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, స్వామివారి కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు. 6వ తేదీన శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, విష్ణుసహస్రనామ హోమం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు స్వామివారి జాతర మహోత్సవంలో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నరసింహ స్వామికి పూజలు



నారాయణపేట టౌన్: పట్టణంలోని పరిమాళపురంలో వెలసిన రాఘవేంద్ర స్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు నరసింహాచారి, విద్వాన్ అనిల్ దేశాయి వేద మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ చేశారు. అనంతరం పూర్ణ ప్రజ్ఞ విద్యాపీఠ రాష్ట్ర ఇన్‌చార్జ్ మక్తల్ రాఘవేంద్ర ఆచార్య అధ్యాత్మిక ప్రవచనం చేశారు. నరసింహస్వామి మహిమలను కొనియాడారు. హైదరాబాద్‌కు చెందిన శరత్ చంద్ర దంపతులను శాలువాతో జోషి రఘు ప్రేమచారి సత్కరించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు శ్రీపాద్, వెంకటేష్, భీంసేన్‌రావు, శేషు, నరసింహ, హరీశ్, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురు ఇన్‌చార్జ్ కార్యదర్శుల నియామకం

ధన్వాడ: మండలానికి ముగ్గురు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శులను కేటాయించినట్లు ఎంపీడీఓ సద్గుణ తెలిపారు. ధన్వాడ పంచాయతీకి ఎంపీఓ సుదర్శన్‌ను ఇన్‌చార్జ్‌గా కేటాయించగా కొండాపూర్, గోటూర్, కిష్టాపూర్, కొండ్రోన్‌పల్లి గ్రామాలకు నర్వ నుంచి వచ్చిన బాలస్వామి, గున్ముక్ల, కంసాన్‌పల్లి, మంత్రోనిపల్లి, యంనోనిపల్లి గ్రామాలకు ఉట్కూర్ నుంచి రాజేష్‌ను, హన్మన్‌పల్లి, తోలగుట్టతండా, చర్లపల్లి, దుడుగుతండా గ్రామాలకు మరికల్ మండలం కన్మనూర్ కార్యదర్శి రాజేష్ కుమార్‌ను కేటాయించారు. మండలంలోని మందిపల్లి గ్రామ కార్యదర్శికి మందిపల్లితండా, పాతపల్లి, పాతతండా, రామకిష్టాయిపల్లి గ్రామాలకు కేటాయించారు.

సరిహద్దు గ్రామాల్లో ప్రచారం



కృష్ణా: మండల సరిహద్దులోని కడెచూర్‌లో గురువారం బీఆర్ఎస్ నాయకులు జేడీఎస్ అభ్యర్థి శరణ్‌గౌపాటీల్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మక్తల్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో రైతులు అభివృద్ధి చెందాలంటే జేడీఎస్‌ను గెలుపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గుర్తును చూయిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌పాటీల్, శివప్ప, రాజప్పగౌడ, జెడీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం

నర్వ: మండల కేంద్రంలో పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాకాహార ర్యాలీ నిర్వహించనున్నట్లు సొసైటీ ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి తెలిపారు. బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం, శాకాహార ర్యాలీని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హోమం



ఊట్కూరు: మండల కేంద్రంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో భాగంగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, నిర్వాహకులు కృష్ణయ్యగౌడ్, నర్సింహరాజుగౌడ్, వేద పండితుడు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే గీత కార్మికుల సంక్షేమం

మరికల్: రాష్ట్రంలో గీత కార్మికులను గుర్తించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆ సంఘం మండల నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, పుల్లయ్యగౌడ్, రామన్‌గౌడ్ అన్నారు. గురువారం వారు మరికల్ విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు మారిన గీత కార్మికుల సమస్యలను గుర్తించలేదన్నారు. కల్లు తీసేందుకు ఈత, తాటి చెట్లను ఎక్కి ఎంతో మంది గీత కార్మికులు ప్రాణాలు పొగుట్టుకున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని వాపోయారు. సమావేశంలో చెన్నకేశవులుగౌడ్, బాలయ్యగౌడ్, రవిగౌడ్, సురెందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలి

మరికల్: వానాకాలం సీజన్ దగ్గర పడుతుండటంతో రైతులకు నకిలీ విత్తనాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ, మొగులప్ప, హరీశ్ అన్నారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వానాకాలం సీజన్ మరో నెల రోజులు ఉండగానే కొందరు వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలను అమ్మేం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాంటి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని వారు కోరారు.

డీకే అరుణ జన్మదిన వేడుకలు

మక్తల్: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు బాల్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు ప్రసన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

నారాయణపేట రూరల్: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ జన్మదినం సందర్భంగా నాయకులు జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. డీకే అరుణ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యరఘుపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రతంగపాండురెడ్డి, బాలం తిమ్మారెడ్డి, లక్ష్మి, రఘు, మహబూబ్‌అలీ, వెంకట్రాములు, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.



8న నిరుద్యోగ బహిరంగ సభ

మక్తల్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈనెల 8న నిర్వహించనున్న నిరుద్యోగ బహిరంగ సభను విజయవతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, పార్లమెంటరీ ఇన్‌చార్జ్ వేణుగౌడ్ కోరారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బహిరంగ సభకు ప్రియాంకగాంధీ హాజరవుతున్నారని తెలిపారు. యువకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గణేష్‌కుమార్, రాజప్పగౌడ్, ఆనంద్‌గౌడ్, చెన్నయ్యగౌడ్, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, నూరొద్దీన్, పరమేశ్వర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న గోపాల్

కోస్గి: ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ కూలీల కడుపు కొడుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. గురువారం నూతన మండల కేంద్రం గుండుమాల్‌లో మేడే వారోత్సవాల సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో దాదాపు 20శాతం నిధులు తగ్గించడంతో కూలీల బతుకుదెరువుపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి రోజుకూలీ రూ.600లు ఇచ్చి సంవత్సరంలో 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నయ్య, కిష్టయ్య, శ్రీనివాస్, కృష్ణయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్: కర్ణాటకలో ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్‌ను నిషేధిత ఉగ్రవాద సంస్థ పీఎఫ్ఐతో పోల్చడాన్ని నిరసిస్తూ పట్టణ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ పట్టణ గౌరవాధ్యక్షులు క్యాతన్ రఘునాథ్, అధ్యక్షులు నర్సింహులు, బజరంగ్‌దళ్ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని, పీఎఫ్ఐ అనే ఉగ్రవాద సంస్థతో బజరంగ్‌దళ్‌ను కలిపి విమర్శించడం సరికాదన్నారు. హామీని తిరిగి వెనక్కి తీసుకోకపోతే మరింత ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ప్రవీణ్ కరదాస్, బజరంగ్‌దళ్ సహ ప్రముఖ్ వెంకటేష్, వెంకటేష్‌గౌడ్, మణి మోడి, ఆకాశ్, బాలకృష్ణ, విజయ్, రాఘవేంద్ర, ఆనంద్, మహేష్ పాల్గొన్నారు.

మంత్రోనిపల్లి ఊర చెరువు పరిశీలన

ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లి ఊర చెరువును గురువారం ఇరిగేషన్‌శాఖ అధికారులు పరిశీలించారు. గ్రామ పంచాయతీ నుంచి ఊర చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో ఈఈ బ్రహ్మానందం డీఈ కిరణ్‌కుమార్, ఏఈ శివనంద్ చెరువును పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న పనులపై ఎస్టిమేషన్ వేసి పంపాలని ఏఈని ఆదేశించారు.



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ముష్టిపల్లి నుంచి గద్వాలకు బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

మక్తల్: మండలంలోని ముష్టిపల్లి నుంచి గద్వాలకు ఆర్టీసీ బస్సును గురువారం సర్పంచ్ బెల్లం విజయలక్ష్మి ప్రారంభించారు. ముష్టిపల్లి నుంచి జూరాల డ్యాం మీదుగా గద్వాలకు నూతన బస్సును నడుపుతుండడంతో ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మక్తల్ వయా కర్ని, అనుగొండ, ముష్టిపల్లి మీదుగా ప్రతి రోజూ ఉదయం బస్సు సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేఖ, అకెన్‌పల్లి సర్పంచ్ లక్ష్మయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

బదిలీ ప్రక్రియకు దరఖాస్తు చేసుకోవాలి

నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 29లోపు కేజీబీవీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు బదిలీ ప్రక్రియకు దరఖాస్తులు చేసుకోవచ్చని డీఈఓ లియాకత్‌అలీ తెలిపారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు మినహాయించి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లాలనే సీఆర్టీ, జీపీసీఆర్టీ, సీఈటీ, ఏఎన్ఎం, అకౌంటెంట్లు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో రెండేళ్ల సర్వీసు పూర్తయి ఉండాలని చెప్పారు. వెబ్‌సైట్‌లో ప్రాధాన్యత క్రమంలో కావాల్సిన స్థానాలు, సంబంధిత సర్టిఫికేట్లను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

వర్కటం చేయూతతో ఇంటి నిర్మాణం



ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో నిరుపేద అయిన కుర్వ సిద్దమ్మకు రూ.2లక్షల సొంత నిధులతో కట్టించిన నివాసాన్ని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్, నాయకులు మహబూబ్, సాయిలు, జబ్బారప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా సభను విజయవంతం చేద్దాం



నర్వ: ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేద్దామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలెం వెంకటయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు ముఖ్య అతిథిగా ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నారాయణపేట జిల్లా ఇన్‌చార్జ్ అర్జున్‌రాజు, ప్రధాన కార్యదర్శి నరేందర్, నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, పుత్రసేన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలమ్మ బ్రహ్మోత్సవాలు



ధన్వాడ: మండలంలోని మందిపల్లి గేట్ వద్ద ఉన్న బాలమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జల్దిబిందె శ్యావోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద బోనం ఎత్తి అమ్మవారి చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం పెట్టి కుంభం పోశారు. అనంతరం కుంభాభిషేకము నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించి జాతర నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

కంటి వైద్య శిబిరం



కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు భాస్కర్‌గౌడ్ 80మందికి కంటి పరీక్షలు నిర్వహించి 30మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్రాములు, ప్రతినిధులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

మక్తల్: మండలంలోని లింగంపల్లిలో వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలను సేవాభావంతో ఆడాలని తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వంటావార్పు



మక్తల్: పట్టణంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వీఓఏలు వంటావార్పు చేపట్టారు. వీరికి సర్పంచ్‌ల సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏలకు రూ.26వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, రమేష్, లక్ష్మయ్య, అంజి, నర్సిములు, బాలయ్య, రాంరెడ్డి, జ్యోతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభోత్సవం

మాగనూర్: మండల కేంద్రంలోని వెలసిన లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభోత్సవం, మధ్యాహ్నం జ్యోతుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయానికి విగ్రహాలను వితరణ చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా బ్రహోత్సవాలు పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో యువకులు కబడ్డీ పోటీలు ప్రారంభించారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కోస్గి ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ–గ్రేడ్ రూ.2,060లు, బీ–గ్రేడ్ రూ.2,040లు క్వింటాల్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హన్మిరెడ్డి, సంజీవ్, నర్సింహా, బాల్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కిష్టునాయక్ పాల్గొన్నారు.

